సాక్షి
ఆదిలాబాద్

ఆదివారం । 21 । మే । 2023



ఉచిత శిక్షణ.. ఉపాధికి నిచ్చెన

మహిళల స్వయం సమృద్ధికి సాయి వైకుంఠ ట్రస్టు చేయూతనందిస్తోంది. వారికి టైలరింగ్, ఎంబ్రాయిడరీ కోర్సుల్లో ఉచిత శిక్షణనిస్తూ.. అండగా నిలుస్తోంది.

9లో▸

దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌రూరల్: 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి కార్పొరేట్ జూనియర్ కళాశాలల్లో ప్రవేశం కోసం అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డు కులాల అభివృద్ధి అధికారి సునితకుమారి ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు,వసతి గృహాల్లో చదివి 10వ తరగతిలో 7జీపీఏకు పైబడి ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులని పేర్కొన్నారు. ఈనెల 22 నుంచి జూన్ 3వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హులైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గరిష్టం/కనిష్టం
43.0/29.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతీవ్రత పెరగనుంది. వడగాలులు వీస్తాయి. ఉక్కపోత ప్రభావం అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు



దుకాణాల్లో తనిఖీ చేస్తున్న సభ్యులు

నేరడిగొండ: నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని రాష్ట్ర విత్తన టాస్క్‌ఫోర్స్ కన్వీనర్ చంద్రకళ హెచ్చరించారు. మండలంలోని విత్తన విక్రయ దుకాణాల్లో విత్తన ధ్రువీకరణ సంస్థ అధికారి దుర్గేష్, సీడ్ టాస్క్‌ఫోర్స్ సీఐ, బోథ్ ఏడీఏ శ్రీధర్ స్వామి, ఏవో భాస్కర్‌తో కలిసి శనివారం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో రైతులు తప్పనిసరిగా రశీదు పొందాలని సూచించారు. వాటిని పంట కాలం వరకు భద్రపర్చుకోవాలని తెలిపారు.

బోథ్/ఇచ్చోడ: బోథ్, ఇచ్చోడ మండల కేంద్రాలోని పలు విత్తన దుకాణాల్లో టాస్క్‌ఫోర్స్ అధికారుల బృందం తనిఖీలు చేపట్టింది. యజమానులు ఎలాంటి అక్రమాలకు పాల్పడినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

పనులు వేగవంతం చేయాలి



పనులను పరిశీలిస్తున్న డీఈవో ప్రణీత

ఆదిలాబాద్‌రూరల్: మన ఊరు–మన బడి పనుల్లో వేగవంతం చేసి ఈ నెలాఖరులోగా పూర్తి అయ్యేలా చూడాలని డీఈవో ప్రణీత అన్నారు. మండలంలోని భీంసరి జెడ్పీ ఉన్నత పాఠశాలను శనివారం సందర్శించారు. మన ఊరు– మన బడి పనులను పరిశీలించారు. నాణ్యత లోపించకుండా సకాలంలో పనులు పూర్తి అయ్యేలా చూడాలన్నారు. ఆమె వెంట సెక్టోరియల్ అధికారి నారాయణ, సహాయ ఇంజినీర్ సల్లాఉద్దీన్, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, కాంట్రాక్టర్ ఉన్నారు.

జూన్ 1లోపు యూనిఫాం సిద్ధం చేయాలి

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్ పాఠశాలలు, గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాలలు, కేజీబీవీలు, మోడల్ స్కూల్స్, అర్బన్ రెసిడెన్షియల్స్‌లో చదివే విద్యార్థులకు సంబంధించిన యూనిఫాం స్టిచ్చింగ్ జూన్ 1వరకు పూర్తి చేయాలని డీఈవో ప్రణీత ప్రకటనలో తెలిపారు. ఆయా యాజమాన్యాల హెచ్‌ఎంలు, ఎస్‌ఎంసీలు ఈ విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించి ప్రక్రియ వేగవంతం చేయాలని సూచించారు.

విద్యార్థులకు పెయింటింగ్ పోటీలు



వాల్‌పై పెయింటింగ్ చేస్తున్న చిన్నారులు

కైలాస్‌నగర్: ప్రపంచ పర్యావరణ దినోత్సవం (జూన్ 5)ను పురస్కరించుకుని మున్సిపల్ ఆధ్వర్యంలో శనివారం వాల్ పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియం వద్ద నిర్వహించిన పోటీలకు ఎండల తీవ్రత, పాఠశాలలకు సెలవుల నేపథ్యంలో 49మంది విద్యార్థులు మాత్రమే హాజరయ్యారు. గోడపై రకరకాల బొమ్మలు గీశారు. ట్రెయినీ కలెక్టర్ పి.శ్రీజ పరిశీలించారు. ఇందులో ప్రతిభ కనబర్చిన వారికి జూన్ 5న కలెక్టర్ చేతుల మీదుగా నగదు బహుతులను అందిస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శైలజ పాల్గొన్నారు.

హజ్ యాత్రికులకు శిక్షణ

ఆదిలాబాద్‌టౌన్: నిబంధనలు పాటిస్తూ హజ్ యాత్ర విజయవంతంగా పూర్తి చేసుకోవాలని ఆదిలాబాద్ హజ్ సొసైటీ అధ్యక్షుడు షాహిద్ అహ్మద్ తవక్కల్ అన్నారు. ఉమ్మడి జిల్లా నుంచి యాత్రకు వెళ్లే వారికి పట్టణ శివారులోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో శనివారం రెండో విడత శిక్షణ నిర్వహించారు. మాస్టర్ ట్రైనర్ అల్లాజ్ మజర్ ఖాస్మీ ప్రొజెక్టర్ ద్వారా యాత్రకు సంబంధించిన వివరాలపై అవగాహన కల్పించారు. జూన్ 7నుంచి ఫ్లైట్లు ప్రారంభమవుతాయన్నారు. యాత్రికులకు ఈ నెల 25న టీఎన్జీవోస్ భవన్‌లో వ్యాక్సినేషన్ ప్రక్రియ ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు మహ్మద్ అసిఫొద్దీన్, నూర్ ఖాన్, అమీమ్ షరీఫ్ పాల్గొన్నారు.

వెరైట్రీస్

సండే స్పెషల్

- చరిత్రకు ఆనవాళ్లుగా.. సజీవ సాక్ష్యాలుగా
- జిల్లాలో శతాబ్దాలకు పైబడిన వృక్షాలు

మనం నిత్య జీవితంలో చూసిన చెట్లు దాదాపు 30..40..50 సంవత్సరాలకు చెందినవి ఉంటాయి. అయితే జిల్లాలో శతాబ్దాల చరిత్ర ఉన్న వృక్షాలు సైతం ఉన్నాయి. ఇందులో కొన్ని చారిత్రక ఆనవాళ్లకు సజీవ సాక్ష్యాలుగా నిలుస్తుండగా.. మరికొన్ని ఔషధ గుణాలతో ప్రత్యేకతను చాటుతున్నాయి. ఇంకొన్ని కాలక్షేపానికి, సేదతీరేందుకు దోహదపడుతున్నాయి. జిల్లాలో ఇలాంటి వాటిపై ఓ లుక్కేద్దాం.

అరుదైన వృక్షం.. ఔషధ గుణం



కైలాస్‌నగర్: జిల్లా కేంద్రంలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయ సమీపంలో గల ఈ అరుదైన వృక్షానికి వందేళ్ల చరిత్ర ఉంది. ఇది ఔషధ గుణాలు కలిగిన ఆఫ్రికన్ జాతికి చెందినది. శాస్త్రీయ నామం అడాన్సోనియా డిజిటాటా. ఔషధ గుణాలు ఉండటంతో దీనిని ట్రీ ఆఫ్ లైఫ్‌గానూ పిలుస్తారు. ఆఫ్రికన్ ఖండంలో కనిపించే ఈ వృక్షాలు తెలంగాణలో అరుదుగా ఉన్నట్లుగా ఆంధ్రా వర్సిటీకి చెందిన ప్రొఫెసర్ లక్ష్మి తన పరిశోధనలో నిర్ధారించినట్లు పట్టణానికి చెందిన వృక్ష ప్రేమికుడు బి.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. మన రాష్ట్రంలో ఇవి నల్గొండ–సూర్యాపేట హైవేలో రెండు ఉండగా మరోటి జిల్లా కేంద్రంలోనే ఉన్నట్లుగా చెప్పారు.70 అడుగుల ఎత్తు వరకు పెరిగే ఈ వృక్షం అరుదైనదని చెబుతున్నారు. దీని ఆకులు, బెరడుతో పాటు పువ్వుల్లోనూ ఎన్నో ఔషధ గుణాలు ఉన్నాయని తేలిందంటున్నారు. మూత్రపిండాలు, మూత్రాశయ రుగ్మతలు, అలసట, అతిసారం, కంటి చికాకు, కడుపు, శ్వాసకోశం వంటి సమస్యలకు ఇవి ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. అరుదైన వృక్షమని తేలడంతో అటవీశాఖ అధికారులు దీని సంరక్షణపై దృష్టి సారించారు. వృక్షం చుట్టు కంచె ఏర్పాటు చేశారు. దీని ప్రాధాన్యత గుర్తించిన వారు బెరడును తీసుకెళుతున్నట్లుగా ఆయన వెల్లడించారు.

మఠంలో నాలుగు శతాబ్దాల వృక్షం




ఆదిలాబాద్: ఈ చిత్రంలో కనిపిస్తున్నది జిల్లా కేంద్రంలోని శ్రీరామచంద్ర గోపాలకృష్ణ మఠంలో ఉన్న మర్రి వృక్షం. ఈ వటవృక్షానికి సుమారు 400ఏళ్ల చరిత్ర ఉందని ప్రస్తుత మఠాధిపతి యోగానంద సరస్వతి స్వామి చెబుతున్నారు. ఈ వృక్షం నీడ కిందనే మఠం వ్యవస్థాపకులు పూర్ణానంద సరస్వతి స్వామీజీ తపస్సు చేసే వారని, దీనిని ఆనుకునే గోపాలకృష్ణ మఠాన్ని నిర్మించారని తెలిపారు. పూర్ణానంద సరస్వతి స్వామి జీవసమాధి సైతం దీని కిందనే కావడం గమనార్హం. అలాగే మిగతా ఎనిమిది మంది మఠాధిపతులను సైతం ఇక్కడే సమాధి చేశారు. ప్రకృతి నుంచి వచ్చిన మనం తిరిగి ప్రకృతికి చెందాలనే ఉద్దేశంతో ఈ చెట్టు కిందే వారిని సమాధి అయినట్లు చెబుతున్నారు స్వామీజీ. ఈ వృక్షం శాఖోపశాఖలుగా విస్తరిస్తే ఆలయ నిర్మాణం దెబ్బతినే అవకాశం ఉన్నందున, తరచూ దీని కొమ్మలను తొలగిస్తుండడం వలన భారీ రూపంలో దర్శనిమవ్వదు.

సకినాపూర్‌లో 300 ఏళ్ల మర్రి



తలమడుగు: ఇది మండలంలోని సకినాపూర్ గ్రామంలో గల మర్రి వృక్షం. సుమారు 300 ఏళ్ల నాటిదని స్థానికులు చెబుతున్నారు. దీని శాఖోపశాఖలు సుమారు 20 గుంటల వరకు విస్తరించి ఉన్నాయి. పంచాయతీ కార్యాలయం ఎదుట ఊరు మధ్యలో ఉన్న ఈ వృక్షం నీడన వృద్ధతరం వారు ఎక్కువగా కాలక్షేపం చేస్తుంటారు. వేసవిలో అయితే ఉదయం నుంచి రాత్రి వరకు సందడి ఎక్కువగా కనిపిస్తుంది.

కుచులాపూర్‌లో రెండు శతాబ్దాల.. చింత



తలమడుగు: మండలంలోని కుచులాపూర్ గ్రామానికి చెందిన మేర స్వామి పంట పొలంలో సుమారు రెండు వందల ఏళ్ల పైబడిన చింత చెట్టు ఈ ప్రాంతంలో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. చెట్టు నాటిన నుంచి ఇప్పటి వరకు ముడు తరాలు గతించి పోయాయని స్థల యజమానితో పాటు స్థానికులు చెబుతున్నారు. మహారాష్ట్రకు వెళ్లే అంతరాష్ట్ర రహదారిని ఆనుకుని ఉండే ఈ వృక్షం కింద వాహనదారులు ఎక్కువగా సేదతీరుతుంటారు.

బండ గుర్తు.. ఈ రావి



సిరికొండ: మండల కేంద్రంలోని ఈ రావి చెట్టుకు సుమారు 150ఏళ్ల పైబడే ఉంటుందని వృద్ధతరం వారు చెబుతుంటారు. కొత్తవారెవరైనా వచ్చిందంటే ఈ చెట్టునే అడ్డాగా సూచిస్తారు స్థానికులు. రోడ్డు పక్కన ఉన్న వృక్షం సిరికొండ నుంచి ఇచ్చోడకు వెళ్లే మార్గంలో కనిపిస్తుంది. వేసవిలో వాహనదారులు ఎక్కువగా దీనికిందనే సేదతీరుతుంటారు.

వడూర్‌లో 150 ఏళ్ల మర్రి



తాంసి: భీంపూర్ మండలంలోని వడూర్ గ్రామ ప్రవేశంలో ఉన్న ఈ మర్రి వృక్షానికి సుమారు 150 ఏళ్లు పైబడి ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. తరాలుగా ఈ చెట్టు కిందనే సేదతీరుతున్నట్లు గ్రామస్తులు పేర్కొంటున్నారు. వృక్షం కింద గ్రామ దేవతలు కొలువవగా.. పండుగల సమయంలో ప్రత్యేక పూజలు చేస్తామని చెబుతున్నారు.

బార్లకు వెసులుబాటు

- ఇక హాఫ్, క్వార్టర్ బాటిళ్లు కూడా లభ్యం
- అధిక విక్రయాల తర్వాత కమీషన్‌లోనూ మార్పులు
- లైసెన్స్ ఫీజు చెల్లింపు సైతం నాలుగు విడతల్లో..
- ప్రభుత్వం ఉద్దీపన చర్యలు



సాక్షి,ఆదిలాబాద్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 39 బార్లు ఉండగా గత కొద్ది కాలంగా మూడు మూతపడ్డాయి. రానున్న రోజుల్లో మరికొన్నింటి పరిస్థితి ఇలాగే ఉండే అవకాశం ఉందని లిక్కర్ వ్యాపారుల్లో చర్చ సాగుతూ వచ్చింది. ప్రధానంగా వైన్స్‌ల వద్ద పర్మిట్ రూమ్ ఏర్పాటు నుంచి గిరాకీ తగ్గిందనేది బార్ యజమానుల వాదన. దీంతో ఈ వ్యాపారంపై కొంత నిరాశ వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం బార్ల వ్యాపారంలో ప్రయోజనం కల్పించే విధంగా ఉద్దీపన చర్యలు చేపట్టింది. తాజాగా వాటిని అమలు చేశారు.

ఇక అన్ని పరిమాణాల్లో లిక్కర్ లభ్యం..

బార్‌కు వెళితే ఫుల్ బాటిల్ నుంచి వివిధ పరిమాణాల్లో ఎంఎల్ లెక్కన వినియోగదారులకు మందు సరఫరా చేస్తారు. అయితే ఒక సారి ఫుల్ బాటిల్ విప్పిన తర్వాత వినియోగదారుల్లో నాణ్యతపై అపనమ్మకం ఉండేది. దీంతో కొన్ని సార్లు గొడవలు కూడా చోటు చేసుకునే పరిస్థితి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం బార్లలో కూడా క్వార్టర్ (180 ఎంఎల్), హాఫ్ బాటిల్ (375 ఎంఎల్)లను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇక బార్లకు వచ్చే వారికి ఎంఎల్ లెక్కన కొలుచుకుంటూ ఇచ్చే పరిస్థితి కనిపించదు. తద్వారా మందుబాబులకు బార్లపై నమ్మకం కలిగించేలా ప్రభుత్వం ఇలాంటి చర్య తీసుకుంది.

కమీషన్‌లో ప్రయోజనం..

బార్ యాజమాన్యానికి కమీషన్‌లోనూ ప్రయోజనం కలిగించే విధంగా ప్రభుత్వం తాజాగా నిర్ణయించి అమలు చేస్తుంది. సాధారణంగా మద్యం విక్రయాల ద్వారా 20 శాతం కమీషన్ యాజమాన్యానికి లభిస్తుంది. ఇప్పటి వరకు లైసెన్స్ ఫీజుపై ఐదు రేట్లు అధిక మద్యం విక్రయాలు జరిపిన తర్వాత కమీషన్ 20 శాతం నుంచి 7 శాతానికి కుదించి ఇచ్చేవారు. ఉదాహరణకు లైసెన్స్ ఫీజు రూ.40 లక్షలు ఉండగా, ఐదు రేట్లు అంటే రూ.2 కోట్ల సరుకు అమ్మిన తర్వాత ఈ కమీషన్ తగ్గేది. దీని కారణంగా నిర్వహణ భారం పెరిగి మామూలు లాభాలతో ఇది నిర్వహించలేమన్న భావన వారిలో కలిగింది. దీనిలోనూ మార్పు చేస్తూ ప్రభుత్వం తాజాగా నిర్ణయాలు ప్రకటించింది. దీనిని ఐదు రేట్ల నుంచి ఏడు రేట్లకు పెంచింది. తద్వారా ఇకపై రూ. 2.80 కోట్ల వ్యాపారం జరిగిన తర్వాత కమీషన్ తగ్గనుంది. ఈ తగ్గింపులోనూ మార్పు చేశారు. ఇప్పటి వరకు 7శాతానికి కుదించగా, తాజాగా దాన్ని 10 శాతానికి పెంచారు. ఈ నిర్ణయాలు బార్ నిర్వహణకు ఉద్దీపనగా మారుతాయా లేదా అనేది చూడాల్సిందే. దీంతో పాటు లైసెన్స్ ఫీజు రెండు విడతల నుంచి నాలుగు విడతల్లో చెల్లించేలా, అలాగే రెంటల్ డీడ్‌కు సంబంధం లేకుండా చలనా కట్టడం ద్వారా రెన్యూవల్ చేయడం వంటి చర్యలు చేపట్టారు.

అన్ని పరిమాణాల్లోనూ అమ్మకాలు



బార్‌లలో ఇకపై అన్ని పరిమాణాల్లో మద్యం అమ్మకాలు జరుపుకోవచ్చు. అలాగే టర్నోవర్‌పై ఏడు రేట్లు అధికంగా అమ్మిన తర్వాత కమీషన్‌లోనూ మార్పులు జరిగాయి. – నర్సింహా రెడ్డి, డిప్యూటీ కమిషనర్, ఆదిలాబాద్ డివిజన్ ఎక్సైజ్ శాఖ

జొన్న కొనుగోలులో ఆంక్షలొద్దు

- కలెక్టరేట్ ఎదుట బీజేపీ ధర్నా



కలెక్టర్ క్యాంపు కార్యాలయం వద్ద జొన్నలను కుప్పగా పోసి నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

కైలాస్‌నగర్: జొన్న పంట కొనుగోలులో ఆంక్షలు సడలించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో శనివారం ఆందోళన చేపట్టారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అక్కడే జొన్నపంటను కుప్పలుగా పోసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ మాట్లాడుతూ, అధిక పంట దిగుబడులు సాధించాలని ఓ వైపు రైతులను ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం వచ్చిన దిగుబడులను కొనుగోలు చేయకుండా పరిమితి విధించడంలో అంతర్యమేమిటని ప్రశ్నించారు. వాతావరణం అనుకూలించడంతో ఈ ఏడాది జొన్న ఎకరాకు 20 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చిందన్నారు. ప్రభుత్వం మాత్రం రైతు నుంచి కేవలం ఎకరాకు ఐదు క్వింటాళ్ల మాత్రమే కొంటామని ప్రకటించడం సరికాదన్నారు. మిగతా పంటను రైతులు ఎక్కడ అమ్ముకోవాలని ప్రశ్నించారు. ప్రభుత్వమే పూర్తి స్థాయిలో కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ రాహుల్‌రాజ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వి.ఆదినాథ్, ప్రవీణ్, రవి, దినేష్ మటోలియ, రాజు, రమేశ్, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులను అందిస్తున్న ఎమ్మెల్యే జోగు రామన్న, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ తదితరులు

హోరెత్తిన ఉత్సాహం..





నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు

వైద్య విద్యార్థుల స్టెప్పులు.. కేరింతలతో జిల్లా కేంద్రంలోని రిమ్స్ వైద్య కళాశాల ప్రాంగణం హోరెత్తింది. కళాశాలలో 2019 వైద్య విద్యార్థుల బ్యాచ్ నిర్వహిస్తున్న నిర్విత్రి–23 కాలేజ్ ఫెస్ట్ ముగింపు వేడుకలు అంబరాన్నంటాయి. నాలుగో రోజు కల్చరల్ నైట్ నిర్వహించారు. శనివారం నిర్వహించిన వేడుకలకు ఎమ్మెల్యే జోగు రామన్న ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. స్వరాష్ట్రంలో వైద్య రంగం గణనీయంగా అభివృద్ధి చెందిందని పేర్కొన్నారు. అనంతరం క్రీడా పోటీల్లో విజయం సాధించిన జట్లకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, కళాశాల అధికారులు, ప్రొఫెసర్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

– ఆదిలాబాద్

క్లుప్తంగా

మల్లేశ్‌కు దాతల సాయం


మల్లేశ్‌ను పరామర్శిస్తున్న చారులత

సాక్షి స్పందన

కడెం: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి, అచేతన స్థితిలో మంచానికే పరిమితమైన మండలంలోని కొత్త మద్దిపడగ గ్రామానికి చెందిన నాంపెల్లి మల్లేష్‌ దీన గాథను.. ఈనెల 20న, 'నా కొడుకును కాపాడండి' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి దాతలు స్పందిస్తున్నారు. శనివారం కొందరు వ్యక్తులు మల్లేశ్‌ ఫోన్‌ పేలో రూ.10 వరకు పంపించారు. కాంగ్రెస్‌ నాయకురాలు రాథోడ్‌ చారులత మల్లేశ్‌ను పరామర్శించి రూ.వెయ్యి రూపాయలు అందజేశారు.

యువతిని వేధించిన కేసులో ఒకరి రిమాండ్‌

ఆదిలాబాద్‌టౌన్‌ : ఆదిలాబాద్‌ పట్టణంలోని విద్యానగర్‌కాలనీకి చెందిన షిండే రోహిత్‌ ప్రేమ పేరిట ఓ యువతిని కొంతకాలంగా వేధిస్తున్నాడు. సోషల్‌ మీడియాలో ఫొటోలు పెట్టి పరువు తీస్తానని బెదిరింపులకు పాల్పడ్డాడు. శనివారం యువతి తండ్రి వన్‌టౌన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్సై జి.నారాయణ, హెడ్‌ కానిస్టేబుల్‌ రాములు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఆ యువకుడిని అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించారు.

'ఉపాధి'ని నిర్వీర్యం చేస్తున్న బీఆర్‌ఎస్‌

ఉట్నూర్‌రూరల్‌: ఉపాధి హామీ పథకాన్ని బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ భొజ్జు పటేల్‌ ఆరోపించారు. మండలంలోని దంతన్‌పల్లి గ్రామంలో కొనసాగుతున్న ఉపాధి పనులను సందర్శించి కూలీలతో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తాగడానికి నీరు, మెడికల్‌ కిట్లు, పనుల వద్దకు వెళ్లడానికి వాహన సౌకర్యం లేకుండా ప్రభుత్వం నామమాత్రంగా పనులు కల్పించడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. ఈ నిధులను శ్మశాన వాటిక, పార్కు, రైతు వేదికలకు మళ్లించడమే ఇందుకు కారణమన్నారు. కూలీలకు తాగడానికి నీరు , మెడికల్‌ కిట్లు, వాహన సౌకర్యాలు కల్పించాలని డిమాండ్‌ చేశారు. అనంతరం కూలీలకు మజ్జిగ ప్యాకెట్లు అందజేశారు. ఆయన వెంట మండల అధ్యక్షుడు రాజేశ్వర్‌, ఎస్టీ సెల్‌ మండల అధ్యక్షుడు జైవంత్‌రావు, నాయకులు మొబీన్‌, భీమన్న, మోయిన్‌, జగన్‌, జైపాల్‌, లాజర్‌, నగేశ్‌ ఉన్నారు.

కార్మిక చట్టాలపై అవగాహన ఉండాలి

ఎదులాపురం: కార్మికులు కార్మిక చట్టాలపై అవగాహన కలిగి ఉండి, అందుకు అనుగుణంగా నడుచుకోవాలని ఎస్సీ, ఎస్టీ స్పెషల్‌ జడ్జి శివరాంప్రసాద్‌ అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని బిల్డింగ్‌ వర్కర్స్‌ యూనియన్‌ భవనంలో నిర్వహించిన కార్మిక చట్టాలపై అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్మికుల చట్టాలు, హక్కులు తెలుసుకోవాలని చెప్పారు. ప్రతీ కార్మికుడు ఈ శ్రామ్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌ఎస్‌ఏ కార్యదర్శి క్షమా దేశ్‌పాండే, బార్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు నగేష్‌, అసిస్టెంట్‌ లేబర్‌ కమిషనర్‌ వినోద్‌, చీఫ్‌ లీగల్‌ ఎయిడ్‌ డిఫెన్స్‌ కౌన్సిల్‌ దాసరి గంగన్న, డిప్యూటీ లీగల్‌ ఎయిడ్‌ డిఫెన్స్‌ కౌన్సిల్‌ అశోక్‌, అసిస్టెంట్‌ లీగల్‌ ఎయిడ్‌ డిఫెన్స్‌ కౌన్సిల్‌ ఉమేష్‌, బిల్డింగ్‌ వర్కర్స్‌ యూనియన్‌ అధ్యక్షుడు బందారి పోషన్న పాల్గొన్నారు.

'ఐబీ'లో హరితహోటల్‌

- పర్యాటకానికి దన్నుగా..
- జిల్లాకేంద్రంలో నిర్మాణం
- భూమిపూజ చేయనున్న మంత్రి


ఆర్‌ అండ్‌ బీ విశ్రాంతి భవనం

నిర్మల్‌: జిల్లా కేంద్రంలో మరో కొత్త నిర్మాణం చోటు చేసుకోనుంది. పర్యాటక అభివృద్ధి దిశగా హరితహోటల్‌ నిర్మాణం కానుంది. స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహం(ఐబీ)లో ఈ హోటల్‌ను నిర్మించనున్నారు. ఇదివరకే ఈ స్థలాన్ని టూరిజం కార్పొరేషన్‌కు అప్పగించారు. ఈమేరకు హైదరాబాద్‌ నుంచి వచ్చిన కార్పొరేషన్‌ అధికారులు శనివారం ఇక్కడ ఉన్న పాత కట్టడాలను తొలగించే పనులను పర్యవేక్షించారు.

రూ.10కోట్లతో హోటల్‌..

జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారిపై ప్రస్తుత కలెక్టరేట్‌ పక్కనే గల ఐబీలో హరితహోటల్‌ను నిర్మిస్తున్నారు. రూ.10కోట్లతో నిర్మాణం చేపట్టేందుకు మెగా కంపెనీ కాంట్రాక్టు దక్కించుకున్నట్లు కార్పొరేషన్‌ అధికారులు తెలిపారు. గ్రౌండ్‌ఫ్లోర్‌తో పాటు రెండంతస్తులుగా భవన నిర్మాణం ఉంటుందని, ఇందులో రెస్టారెంట్‌తో పాటు బార్‌కు అనువుగా నిర్మాణం ఉంటుందని, అలాగే 20గదులు ఉంటాయని అధికారులు వివరించారు. పర్యాటకంగా జిల్లాను అభివృద్ధి చేసే దిశలో హరిత హోటల్‌ నిర్మిస్తున్నట్లు తెలిపారు. మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి చేతుల మీదుగా ఆదివారం భూమిపూజ ఉంటుందని పేర్కొన్నారు.

నిజాం కాలం నాటి కట్టడాలు..

చుట్టూ వేపచెట్లు, నిండుగా పచ్చని వాతావరణంతో ఎప్పుడూ చల్లగా ఉండే ఐబీ చాలా మందికి తెలుసు. నిర్మల్‌కు వచ్చే ప్రజాప్రతినిధులు, బడా నేతలు, అధికారులందరికీ అతిథ్యం ఇచ్చే ఈ రోడ్లు భవనాల శాఖ అతిథిగృహం ఎప్పుడో నిజాం కాలం నాటి నిర్మాణం. పూర్తిగా డంగును్నంతో లావుగా ఉండే గోడలతో కట్టడం వల్ల ఎప్పుడూ చల్లగా ఉంటుంది. చుట్టూ ఉన్న వేప చెట్లూ ఇక్కడికి వచ్చే వారందరిని కాసేపు సేద తీరేలా చేస్తాయి. ప్రస్తుతం హరిత హోటల్‌కు ఇవ్వడంతో ఈ చారిత్రక నిర్మాణాలు నేలమట్టం అవుతున్నాయి. అందులోని చెట్లనూ తొలగిస్తుండటంతో చాలామంది విచారం వ్యక్తం చేస్తున్నారు.


గదులను కూల్చివేస్తున్న జేసీబీ

మళ్లీ టిక్కెట్‌ నాకే.. గెలిచేది నేనే

- బోథ్‌ ఎమ్మెల్యే రాథోడ్‌ బాపురావు


లబ్ధిదారులకు చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే బాపురావు

నేరడిగొండ: బీఆర్‌ఎస్‌ పార్టీ నుంచి ఎమ్మెల్యే టిక్కెట్‌ వచ్చేది తనకేనని, ఎమ్మెల్యేగా హ్యాట్రిక్‌ విజయం సాధించేది నేనేనని బోథ్‌ ఎమ్మెల్యే రాథోడ్‌ బాపురావు ధీమా వ్యక్తం చేశారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీవో సమావేశ మందిరంలో కళ్యాణలక్ష్మి, షాదీముబారక్‌ చెక్కులు హాజరైన 25మంది లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇటీవల తమ పార్టీకే చెందిన ఓ నాయకుడు తనకే టిక్కెట్‌ వస్తుందంటూ సోషల్‌ మీడియా ద్వారా ప్రచారం చేసుకుంటున్నారని, అసత్యపు ప్రచారం నమ్మొద్దని సూచించారు. పార్టీ కోసం పని చేయకుండా టిక్కెట్‌ కోసం పగటి కలలు కంటున్నారని ఎద్దేవా చేశారు. మళ్లీ అధికారంలోకి వచ్చేది బీఆర్‌ఎస్‌ పార్టీ అని ధీమా వ్యక్తం చేశారు. కల్లబొల్లి మాటలు చెబుతూ బీజేపీ, కాంగ్రెస్‌ పార్టీల నాయకులు పగటి వేషాధారణలో తిరుగుతున్నారని, అలాంటి వారిని పట్టించుకోవద్దన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి ఎల్లవేళలా అందుబాటులో ఉంటున్నానని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రాథోడ్‌ సజన్‌, మండల ఉపాధ్యక్షుడు ఏలేటి మహేందర్‌రెడ్డి, ఆ పార్టీ మండల కన్వీనర్‌ శివారెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్‌ దావుల భోజన్న, తహసీల్దార్‌ పవన్‌చంద్ర, ఆర్‌ఐ నాగోరావు, సీనియర్‌ అసిస్టెంట్‌ మీరబాయి, కుమారి పీఏసీఎస్‌ చైర్మన్‌ మందుల రమేష్‌ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌ను ఓడించే శక్తి బీజేపీకే ఉంది

- మాజీ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి


మాట్లాడుతున్న మహేశ్వర్‌రెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్‌: బీజేపీలో తాను చేరినప్పటి నుంచి మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డికి కంటిమీద కునుకు లేకుండా పోయిందని, అందుకే తనపై సోషల్‌ మీడియాలో అసత్య ప్రచారాలు చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. తాను తిరిగి కాంగ్రెస్‌లోకి వెళ్తున్నట్లు ఫేక్‌ ప్రచారం చేస్తున్నారని, రాష్ట్రంలో రామరాజ్యం తెచ్చే వరకూ బీజేపీలోనే ఉంటానని అన్నారు. ఒకవేళ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి బీఆర్‌ఎస్‌ వీడి బీజేపీలోకి వస్తే ఎమ్మెల్యే సీటు త్యాగం చేస్తానని తెలిపారు. తమకు పార్టీ మారాల్సిన అవసరం లేదని, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డినే బీజేపీలోకి ఆహ్వానిస్తామని చెప్పారు. జిల్లాకేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇటీవల కర్ణాటక ఎన్నికలు, ఫలితాల తీరుతో కాంగ్రెస్‌, బీఆర్‌ఎస్‌ ఒక్కటేనని తేలిపోయిందన్నారు. బీఎస్పీ నుంచి ఎమ్మెల్యేగా గెలిచి మంత్రి పదవికి ఆశపడి రాత్రికి రాత్రే పార్టీ మారిన ఘనత ఐకేరెడ్డికే దక్కుతుందన్నారు. ఈ సమావేశంలో బీజేపీ సీనియర్‌ నేత అంజుకుమార్‌ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి సామ రాజేశ్వర్‌రెడ్డి, పట్టణాధ్యక్షుడు సాదం అరవింద్‌, ప్రధాన కార్యదర్శి నరేశ్‌, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు అర్జున్‌, శ్రీనివాస్‌, అలివేలు, భాస్కర్‌ పాల్గొన్నారు.

చిన్నయ్యను కాపాడుకుంటాం

- ఎమ్మెల్యే జోగు రామన్న


మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగు రామన్న

ఆదిలాబాద్‌రూరల్‌: నేతకాని మహర్‌ సామాజిక వర్గానికి చెందిన బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య తప్పు చేసినట్లు ఆధారాలతో నిరూపిస్తే తలవంచిపిస్తామని.. కానీ తప్పుడు ఆరోపణలు చేస్తే మాత్రం ఆయనను కాపాడుకోవడానికి రాష్ట్రంలోని బీఆర్‌ఎస్‌ ఎమ్మెల్యేలమంతా ఏకమై అండగా నిలుస్తామని ఆదిలాబాద్‌ ఎమ్మెల్యే జోగు రామన్న స్పష్టం చేశారు. జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్‌ హాల్‌లో శనివారం నిర్వహించిన నేతకాని మహర్‌ సంక్షేమ సంఘం సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుర్గం రాజేశ్వర్‌ మాట్లాడుతూ, ప్రస్తుతం తమ సామాజిక వర్గానికి చెందిన ఏకైక ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యనే అన్నారు. రాజకీయంగా ఆయనను అణగదొక్కడానికే ఆర్టిజన్‌ సంస్థకు చెందిన ఆదినారాయణరెడ్డి ఓ మహిళను అడ్డుపెట్టుకొని నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నాడని విమర్శించారు. ఎమ్మెల్యేపై ఆరోపణలను ఖండిస్తూ ఆది నారాయణరెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పోలీస్‌ స్టేషన్లలో ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే రామన్న మాట్లాడుతూ, సహచర బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యపై చేస్తున్న ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అసత్య ఆరోపణలు చేస్తే చట్టపరంగా వెళ్తామన్నారు. అంతకు ముందు అంబేద్కర్‌, బుద్ధుని చిత్ర పటాల వద్ద జ్యోతి ప్రజ్వలన చేశారు. సమావేశంలో సంఘం రాష్ట్ర స్టీరింగ్‌ కమిటీ సభ్యులు దుర్గం నర్సయ్య, నాయకులు దుర్గం శేఖర్‌, దీపక్‌ కుమార్‌, సుదర్శన్‌, సంతోష్‌, మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు సర్పే సోంబాయి, తదితరులున్నారు.

అకాల వర్షంతో అన్నదాతల్లో గుబులు


కుంటాలలో మక్కల కుప్పపై టార్పాలిన్లు కప్పుతున్న రైతులు

కుంటాల: మండలంలోని అంబకంటి, ఓలా, కుంటాల, అందకూర్‌, వెంకూర్‌ తదితర గ్రామాల్లో శనివారం సాయంత్రం ఉరుములు, మెరుపులు చిరుజల్లులతో కూడిన తేలికపాటి వర్షం కురిసింది. దీంతో కొనుగోలు కేంద్రాలు, కల్లాల వద్ద ఉన్న మొక్కజొన్న, ధాన్యం తడవకుండా రైతులు వాటిపై టార్పాలిన్లు కప్పారు. పది నిమిషాల పాటు వర్షం కురిసి ఒక్కసారిగా ఆగిపోవడంతో ఆయా గ్రామాల్లోని ప్రజలు ఉక్కపోతతో సతమతమయ్యారు.

నర్సాపూర్‌(జి)లో అకాల వర్షం...

నర్సాపూర్‌(జి): నర్సాపూర్‌(జి) మండల కేంద్రంలో సాయంత్రం కురిసిన అకాల వర్షానికి ధాన్యం, మొక్కజొన్న పంట తడిసిపోయింది. రైతులు ఇళ్ల నుంచి పరుగులు తీసి ధాన్యంపై కవర్లు కప్పారు.తూకం వేసిన బస్తాలు వర్షానికి తడిసిపోయాయి.

మళ్లీ.. బడి రోజుల్లోకి..


సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

- 25ఏళ్ల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు
- రక్తదానం చేసిన పూర్వ విద్యార్థులు
- సంబురంగా అపూర్వ సమ్మేళనం

నిర్మల్‌చైన్‌గేట్‌: 'అరె.. అతను లికిత్‌ కదా..! ఎంతలా మారిపోయాడు. స్కూల్లో ఉన్నప్పుడు ఎలా ఉండేవాడు. అస్సలు.. గుర్తుపట్టలేదు తనను..' అని చిన్ననాటి స్నేహితురాలు అంటుంటే.. ' అరె మామ.. మనం ఇప్పుడా.. అప్పుడా.. ఎప్పుడో 25 ఏళ్ల కింద కలిసి చదువుకున్నం. ఆ తర్వాత మళ్లీ కలుసుకున్నది కూడా లేదు. ఇన్నేళ్ల తర్వాత మారిపోకుండా.. ఇంకా చిన్నప్పటి లాగే ఉంటారా... అంటూ బాల్య మిత్రుడు నవ్వుతూ అన్నాడు. ఇలా సరదా సంభాషణలతో.. చిన్ననాటి జ్ఞాపకాల నెమరు వేసుకుంటూ.. మిత్రులంతా రోజంతా సందడిగా గ డిపారు. జిల్లా కేంద్రంలోని శ్రీ సరస్వతి జ్ఞాన మందిర్‌ ఉన్నత పాఠశాలలో1998–99 లో పదో తరగతి కి చెందిన విద్యార్థులు శనివారం జిల్లా కేంద్రంలోని మయూరి ఇన్‌ హోటల్‌లో కలుసుకున్నారు. 25ఏళ్ల తర్వాత కలిసిన వారిలో ఎంతోమంది ఉన్నత స్థాయికి ఎదిగారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులు అంబరాని మల్లేష్‌ మధుల్కర్‌, ప్రణీత, హనుమాన్లు, రాజేందర్‌, సురేశ్‌లను సన్మానించుకున్నారు. అనంతరం రక్తదానం చేశారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో 'గిరి' విద్యార్థుల సత్తా

- జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

ఆదిలాబాద్‌: రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (సాట్‌) ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో శుక్రవారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఖేలో ఇండియా గిరిజన క్రీడా జట్ల ఎంపిక పోటీల్లో జిల్లా క్రీడాకారులు ప్రతిభ కనబరిచారు. జిల్లాలోని జాతర్ల గిరిజన క్రీడ పాఠశాలకు చెందిన శ్రీకాంత్‌ జావెలిన్‌ త్రోలో గోల్డ్‌ మెడల్‌, షాట్‌పుట్‌లో సిల్వర్‌ మెడల్‌ కైవసం చేసుకున్నాడు. అదే విధంగా ఉట్నూర్‌ గిరిజన పాఠశాలకు చెందిన కె.పరుశురాం 800 మీటర్ల పరుగులో, పి.సతీష్‌ కుమార్‌ డిస్కస్‌ త్రోలో, జగ్జీవన్‌ హై జంప్‌లో కాంస్య పతకాలు సాధించారు. అంతేకాకుండా లాంగ్‌జంప్‌ ఈవెంట్లో జంగుబాయి, 100 మీటర్ల పరుగులో వైష్ణవి బంగారు పతకాలు సాధించారు. ఖోఖోలో గిరిజన పాఠశాలకు చెందిన నరేష్‌, ఎం. ప్రశాంతలు ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. శనివారం జిల్లా కేంద్రానికి చేరుకుగా ఆదిలాబాద్‌ రైల్వేస్టేషన్‌లో జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి వారికి స్వాగతం పలికి సన్మానించారు. ఐటీడీఏ పీఓ కె.వరుణ్‌రెడ్డి, దిలీప్‌కుమార్‌లు ఒక ప్రకటనలో అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో శిక్షకులు సునంద, శివ, లక్ష్మినారాయణ, రవీందర్‌ ఉన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌కు దాహం..



భైంసాటౌన్‌: ఇదేంటి ట్రాన్స్‌ఫార్మర్‌కు దాహం అనుకుంటున్నారా.. అవునండీ దానికీ దాహం వేస్తుంది. ఎర్తింగ్‌ వద్ద నీటి పదును లేకపోతే ట్రాన్స్‌ఫార్మర్‌ ట్రిప్‌కు గురై విద్యుత్‌ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని సిబ్బంది చెబుతున్నారు. విపరీతమైన ఎండల నేపథ్యంలో భైంసాలోని కమల థియేటర్‌ ప్రాంతంలో ట్రాన్స్‌ఫార్మర్‌ శనివారం మాటిమాటికీ ట్రిప్‌కు గురై విద్యుత్‌ సరఫరాకు అంతరాయం కలిగించింది. దీంతో విద్యుత్‌ సిబ్బంది ఇలా ఎర్తింగ్‌ హోల్‌లో నీరు పోసి ట్రాన్స్‌ఫార్మర్‌ ట్రిప్‌ కాకుండా చూశారు.

చెరువు భూమి కొలతలు కొలిక్కి వచ్చేనా .?

సోన్‌: మండలం మాదాపూర్‌ గ్రామంలో కొత్తచెరువు, పల్లె చెరువు, మొల్లోడి చెరువు, పోచమ్మ చెరువులు ఉన్నాయి. చెరువుల చుట్టు రైతులు శిఖం భూమిని కబ్జా చేస్తున్నారని మాదాపూర్‌ గ్రామస్తులు తహసీల్దార్‌ కార్యాలయంలో వారం రోజుల క్రితం ఫిర్యాదు చేశారు. శనివారం అధికారులు కొత్త చెరువును సర్వే నిర్వహించేందుకు వచ్చారు. కబ్జాకు గురైన భూమికి సంబంధించిన పత్రాలు సరిగ్గా లేవని అధికారులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. అధికారుల తీరుపై గ్రామస్తులు అసహనం వ్యక్తం చేశారు.

ఇచ్చోడ ఎఫ్‌ఆర్వో మృతి


పాండురంగ్‌ (ఫైల్‌)

ఇచ్చోడ: ఇచ్చోడ ఎఫ్‌ఆర్వోగా విధులు నిర్వహిస్తున్న జాదవ్‌ పాండురంగ్‌ (52) శనివారం మృతి చెందాడు. పాండురంగ్‌ కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. రెండు రోజుల కిందట నిర్మల్‌ జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రిలో ఆపరేషన్‌ చేయించుకున్నారు. శనివారం సాయంత్రం ఆస్పత్రి నుంచి డిచార్జ్‌ చేస్తామని ఆస్పత్రి సిబ్బంది తెలిపారు. ఇంతలోనే బాత్‌రూంకు వెళ్లిన పాండురంగ్‌ కాలుజారి పడిపోయాడు. తలకు బలమైన గాయం కావడంతో అపస్మారకస్థితిలోకి వెళ్లిపోయాడు. పరిస్థితి విషమించడంతో కుటుంబ సభ్యులు నిజామాబాద్‌లోని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. ఎఫ్‌డీవో బర్నాబా, అటవీశాఖ సిబ్బంది తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేసి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

అతిగా మద్యం తాగి ఒకరి మృతి

ఆదిలాబాద్‌టౌన్‌: మద్యం అతిగా తాగి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. టూటౌన్‌ ఎస్సై వివరాల ప్రకారం .... జార్ఖండ్‌ రాష్ట్రానికి చెందిన అనిల్‌ రాణ ఎనిమిది మంది కూలీలను తీసుకొచ్చి ఆదిలాబాద్‌ పట్టణంలోని కార్పెంటర్‌గా పనులు చేయిస్తున్నాడు. వీరంతా ఫిల్టర్‌బెడ్‌లో అద్దెకు ఉంటున్నారు. వీరిలో ఒకరైన మహేష్‌ రాణ (45) శుక్రవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. బస్టాండ్‌లో చెట్ల కింద మద్యం సేవించి పడి ఉండడాన్ని గమనించిన అనిల్‌ రాణ ఇంటికి తీసుకువచ్చి పడుకొబెట్టాడు. సాయంత్రం వెళ్లి చూసేసరికి మృతి చెంది ఉన్నాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విష్ణు ప్రకాష్‌ తెలిపారు.

ప్రాజెక్టులో దూకి వ్యక్తి ఆత్మహత్య

తాంసి: భార్య పుట్టింటి నుంచి రావడం లేదని మద్యానికి బానిసై జీవితంపై విరక్తితో ఓ వ్యక్తి మత్తడివాగు ప్రాజెక్టులో దూకి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శనివారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... ఆదిలాబాద్‌రూరల్‌ మండలంలోని పొచ్చెర గ్రామానికి చెందిన గొడుగుల కళ్యాణ్‌ (24) కూలీ పనులు చేస్తూ జీవిస్తున్నాడు. ఈ క్రమంలో కొంతకాలంగా మద్యానికి బానిసై పనులు చేయడం మానేశాడు. భర్త మద్యానికి బానిసకావడంతో భార్య పుట్టింటికి వెళ్లి తిరిగి రావడం లేదు. దీంతో మనస్తాపానికి గురైన కళ్యాణ్‌ శుక్రవారం రాత్రి మద్యం మత్తులో మత్తడివాగు ప్రాజెక్టులో దుకాడు. శనివారం ఉదయం ప్రాజెక్టులో మృతదేహాన్ని గమనించిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. వారు చేరుకుని మృతదేహాన్ని బయటకు తీసి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై లాల్‌సింగ్‌ నాయక్‌ తెలిపారు.

20 గొర్రెలు మృతి

కుభీర్‌: మండలంలోని జామ్‌గాం గ్రామంలో శనివారం మధ్యాహ్నం సర్ఫ్‌, యూరియా కలిపిన నీటిని తాగి 20 గొర్రెలు మృత్యువాతపడ్డాయి. గ్రామస్తుల వివరాల ప్రకారం... గ్రామానికి సమీపంలో శ్యాల యోగేష్‌కు చెందిన చేనులో బోరుబావి ఉంది. మోటార్‌ను బయటకు తీసేందుకు సర్ఫ్‌, యూరియా కలిపిన నీటిని బోరుబావిలో పోసి వెళ్లిపోయాడు. మధ్యాహ్నం సమయంలో ఆనంద్‌ తన గొర్రెలను తీసుకుని ఆ మోటార్‌ వద్దకు వచ్చాడు. మోటార్‌ ఆన్‌చేయగా ఆ నీటిని గొర్రెలు తాగాయి. ఆ నీటిని తాగిన గొర్రెలు కిందపడిపోయాయి. దీంతో ఆనంద్‌ సమాచారంతో పశు వైద్యుడు సర్వోత్తమ్‌కు ఫోన్‌ చేశాడు. డాక్టరు వచ్చేలోగా 20 గొర్రెలు మృత్యువాతపడ్డాయి. మరో 10 గొర్రెలకు చికిత్స చేయగా బతికిబయట పడ్డాయి. గొర్రెల విలువ రూ.2లక్షల వరకు ఉంటుందని, తనకు నష్టపరిహారం ఇప్పించి ఆదుకోవాలని ఆనంద్‌ తహసీల్దార్‌తో కోరాడు. సర్పంచ్‌ ముజాయిత్‌ ఖాన్‌, ఉపసర్పంచ్‌ గణేశ్‌, నాయకులు సంజు ఉన్నారు.